



# సుష్మ నవ్వింది

– పి. రాధా చలపతి

సుష్మ నవ్వింది! ఒక్కసారిగా...

మామూలుగా నవ్వడం కాదు, పోలయ్యని చూడగానే ఫక్కుమని నవ్వింది! నవ్వి, నవ్వి, సుష్మకి కడుపులో నొప్పి కూడా వచ్చింది!

"అత్తయ్యా! మంచినీళ్ళు..." అంటూ కడుపు పట్టుకుని కింద కూర్చుండిపోయింది...

గ్లాసుతో నీళ్ళు పట్టుకుని కంగారుగా వచ్చింది సుభద్రమ్మ.

"అంతగా నవ్వడం దేనికి...? కడుపు బిగవట్టింది... ఈ నీళ్ళు త్రాగు... కొబ్బరి నూనె మర్దనా చేస్తాను... అంటూ కొబ్బరి నూనెతో వచ్చింది...

"వుట్టి మనిషివి కూడా కాదు... అంత నవ్వు ఎందుకు వచ్చింది? ఆ పోలయ్యని చూసేనా?"

సుష్మ వెంటనే మాట్లాడలేకపోయింది... మంచీ నీళ్ళు త్రాగాక కాస్త సర్దుకుని అప్పుడు జవాబు చెప్పింది...

"ఒక్కసారిగా ఆ ఆకారాన్ని చూడగానే ఎందుకో నవ్వాపుకోలేకపోయాను... నన్ను చూడగానే - "సాల్యూట్" చేస్తుంటే మరీ నవ్వు వచ్చింది..." అంటూ మళ్ళీ నవ్వేసింది.

సుష్మ నవ్వు చూసి పోలయ్య మాత్రం ఖంగు తిన్నాడు - "నా ఆకారం చూసేగదా అమ్మ గారు నవ్వింది" అన్న భావన వచ్చింది...

"నేను పన్లోకి రాను... పోతున్నా" నన్నాడు తలొంచుకుని...

సుభద్రమ్మ కోడలి గది నుండి బయటికి రాగానే అన్నాడు పోలయ్య -

"నిన్ను చూసి కాదు నవ్వింది - నువ్వు అమ్మ గారిని చూసి సాల్యూట్ చేశావట గదా?... అది చూసి నవ్విందట!..." సుభద్రమ్మ చెప్పింది అసలు విషయం...

"అలా చెయ్యడం తప్పా? అమ్మ గారు...?"

"లేదు - తప్పు కాదు... చక్కగానే ఉంటుంది... పనిలోకి ఇవాళే వచ్చావు... నీ పని కూడా నాకు నచ్చింది... మానేయకు.. చిన్నమ్మ గారికి నేను చెపుతలే... ఇదిగో డబ్బు తీసుకో... రేపు పెందరాళే వచ్చి నీ పని చేసుకుని వెళ్ళిపో..." అంటూ డబ్బు ఇచ్చి పంపేసింది...

ఆ రోజే పనిలోకి వచ్చాడు పోలాయ్!

నల్లగా, కురచగా ఉంటాడు పోలాయ్! అయినా చలాకీగా ఉంటాడు - చకచకా పనులు చేసుకు పోతడు. చాకలి వీరన్న కొడుకు పోలాయ్. వీరన్న మాత్రం పొడుగ్గా బలిష్ఠంగా ఉంటాడు - భార్య కూడా బాగానే ఉండేది. పోలయ్య తప్ప మిగిలిన పిల్లలు బాగానే ఉంటాడు... కాని పోలయ్య మాత్రం కురచగా ఉంటారు... రెండు కాళ్ళు కాస్త వంపు కలిగి ఉంటాయ్!

అందువలన మరీ "కురచగా" కనిపిస్తాడు... కాని చాలా హుషారుగా పనులు చేస్తాడు... బట్టలు బండకేసి బాది, బాది చక్కగా ఉతుకుతడు... చకచకా ఉతికి - బల్లపై నుంచుని తాడుకి వ్రేలాడదీస్తాడు...

పెళ్ళయిన ఐదేళ్ళకి కడుపు నొప్పి వచ్చింది సుష్మకి... మొదటిసారి అబార్షన్ అయ్యింది... ఈసారి జాగ్రత్తగా ఉండాలని డాక్టర్లు హెచ్చరించారు. వీలైనంత విశ్రాంతిగా ఉండాలన్నారు... ఎక్కువ పనులు చేయకూడదని పని మనిషి కాక, బట్టలుతకటానికి వీరన్నని బ్రతిమాలి పోలయ్యని పిలిపించింది... చక్కగా ఉతికి ఆరవేశాడు... సుభద్రమ్మకి నచ్చింది వాడి పని. కానీ సుష్మకి నవ్వు తెప్పించింది వాడి వాలకం!

పనిలోకి రానన్నాడు...

సుభద్రమ్మ బ్రతిమాలడం వలన మర్నాడే కాదు, రోజూ వస్తున్నాడు... తన పనేదో తాను చూసుకుని వెళ్ళిపోతున్నారు... ఎవరితోనూ మాట్లాడడం లేదు... కానీ ఓ రోజు సుష్మ అక్కడే కూర్చుని వాడు చేసే పనిని శ్రద్ధగా వీక్షిస్తూ మాటల్లోకి దింపింది.

"ఒరేయ్ పోలాయ్! మీ ఇంట్లో అందరూ నీలాగే ఉంటారా? అంటే మీ తాత ముత్తాత ఎవరైనా నీలాగే ఉండేవారా?..."

"లేదండీ! చిన్నమ్మగోరూ!. మా తాత ముత్తాతలంత జమాజెట్టీల్లా ఉండేవారట!... నానొక్కడినే ఇలా ఉంటాను..."

"మీ నాన్న గారు పొడుగ్గానే ఉంటారు గదా?"

"అనలండీ మా అమ్మ కడుపులో వడ్డప్పుడే నాలాంటి మడిసిని చూసి దడుసుకున్నదట... అందుకే నేను అలాగే పుట్టానని మా అమ్మ

చెప్పింది. నన్ను చూసి బెంగపడిపోయి మంచాన పడింది. నా ఏన్నప్పుడే వచ్చిపోయింది" పోలయ్య కళ్ళు చెమ్మగిల్లాయి ఆ మాటలు చెప్తుంటే..

ఆ మాటలు విని సుష్మ ఉలిక్కిపడింది!...

అయితే కంగారుగా అత్తగారి దగ్గరికి వెళ్ళింది...

"మెల్లిగా నడవమని చెప్పానా? ఎందుకా కంగారు!" సుభద్రమ్మ వారిస్తూనే ఉంది.

"అత్తయ్యా - ఆ పోలయ్య చెప్పిన సంగతి విన్నారా?..." అంటూ అత్త గారి ఒడిలో వాలిపోయి బావురుమన్నది సుష్మ...!

"ఏమిటి ఏమన్నాడు? చెప్పకుండానే అలా బెంబేలుపడకు... చెప్పు..." 'వాళ్ళమ్మ 'పోలయ్య లాంటి మనిషిని చూడబట్టే పోలయ్య అలా పుట్టాడట!"

"అయితే?" ఏమిటమ్మా నీ అనుమానం?"

"అయితే నేనూ చూశాను గదా? పోలయ్యని... మరైతే... వద్దు..." ఎంత ఆపుకుందామన్నా దుఃఖం ఆగడం లేదు సుష్మకి.

"ఛా! అలా ఎన్నడూ జరగదు... నీకు వండంటి బిడ్డే పుట్టాడు... - లేనిపోని అనుమానాలతో బాధపడకూడదు... వెళ్ళి ముఖం కడుక్కో... బాబు వచ్చే వేళయింది... లే... వడ్డించేస్తాను. అంత భోజనాలు చేయవచ్చు... వెళ్ళి ముఖం కడుక్కో..." కోడలికెంతో అనునయంగా చెప్పింది.

సుష్మ లేచి బాత్ రూమ్‌లోకి వెళ్ళింది. ఇంతలో ఆదిత్య కూడా వచ్చాడు. సుభద్రమ్మ అందరికీ భోజన ఏర్పాట్లు చూడడానికి లేచింది.

సుష్మ మౌనంగా కంచంముందు కూర్చుంది. అన్నం సహించలేదు.

"ఏమిటీ - సుష్మా వంట్లో బాగుండలేదా? ... టమాటా పప్పు బ్రహ్మాండంగా ఉంది... తిను..." ఆదిత్య అన్నాడు.

"నీ కోసమే చేశాను పుల్ల పుల్లగా తింటావని... తిను తల్లీ! మనస్సులో అలాంటి ఆలోచనలు రానివ్వకు... అన్నం తిను... లేకపోతే నీరసం వస్తుంది."

అతి కష్టంగా ఒక్కో ముద్దా మింగి... మజ్జిగ అన్నం మాత్రం తిని లేచింది...

ఆదిత్యకి కంగారుగా ఉంది...


"ఏం జరిగింది?... వంట్లో ఏమైనా...?"...

"కాదురా మనస్సు పాడు చేసుకుంటోంది..." అంటూ పోలయ్య సంగతి చెప్పింది... సుష్మ మెంటాలిటీకి ఆదిత్యకి నవ్వు వచ్చింది... తేలిగ్గా తీసి పారేశాడు...

"పిచ్చీ! సైన్స్ గ్రాడ్యుయేట్‌వి, మోడరన్ 'గాళ్' వి నీకు ఇలాంటి నమ్మకాలుండకూడదు... అసలలాంటి ఆలోచనలే రాకూడదు..." అన్నాడు.

ఒక ప్లేటు నిండా ఆపిల్ పండ్ల ముక్కలతో వచ్చింది సుభద్రమ్మ.

"అన్నం సరిగ్గా తినలేదు... ఈ పండ్లు తిను... వెధవ ఆలోచనలతో ఆరోగ్యం పాడు చేసుకోకు...




సాయంత్రం త్వరగా వచ్చి ఎక్కడికైనా వెళ్ళి రండి..." అని కొడుక్కి చెప్పి వెళ్ళిపోయింది.

"అయితే ఇవాళ కళా మందిరంలో డాన్స్ ప్రోగ్రామ్ ఉంది వెళ్దాం రెడీగా ఉండు... త్వరగా వచ్చేస్తాను... అంత వరకు పడుకుని రెస్టు తీసుకో' అని చెప్పి బట్టలు మార్చుకుని ఆఫీసుకి వెళ్ళిపోయాడు ఆదిత్య -

** ** ** **

ఈ మధ్య పోలయ్య రావడం లేదు... రాకుండా కట్టుదిట్టం చేసింది సుభద్రమ్మ - బట్టలు రెండ్రోజులకోసారి వీరయ్యే పట్టుకెళ్ళి రేవు దగ్గర ఉతికి తీసుకు వస్తున్నాడు... సుష్మ ఓ నెల పాటు పుట్టింటికి వెళ్ళి ఈ మధ్యే తిరిగి వచ్చింది... కాస్త కోలుకుంది మానసికంగా... కాళ్ళు కాస్త వాపు చూపితే పూర్తిగా ఉప్పు తగ్గించి ఆహారం తీసుకోమన్నారు డాక్టరు - ఎనిమిదవ నెల రాగానే పూర్తిగా బెడ్ మీదే ఉండేలా కట్టడి చేశారు... సుభద్రమ్మకి తోడుగా సుష్మ తల్లి కూడా వచ్చింది... తల్లి కంటే కూడా సుభద్రమ్మ కోడలి విషయంలో చాలా జాగ్రత్త తీసుకుంటోంది. సుష్మకి విసుగు కలగకుండా ఉదయం, సాయంత్రం కూడా సుందరకాండ పారాయణ చేస్తోంది - భగవద్గీత శ్లోకాలు చదివి వినిపిస్తోంది... అప్పుడప్పుడు శ్రీకృష్ణుడి బాల్య క్రీడలు చదివి వినిపిస్తోంది... తల్లి, తల్లిలాంటి అత్తగారి సపర్యలతో సుష్మ ఆరోగ్యం బాగా కోలుకుంది... మరో వారంలో పురుడు వస్తుందని డాక్టరు చెప్పింది.

** ** ** **

ఆదిత్య కూడా సెలవు పెట్టి ఇంట్లోనే ఉంటున్నాడు...

ఆ రాత్రి నిద్ర నుండి "కెవ్వు" మంటూ లేచింది సుష్మ...

"నాకేదో భయంగా ఉంది మీరు నా దగ్గరే ఉండండి!" అంటూ భర్త చెయ్యి గట్టిగా పట్టుకుంది... సుష్మ కంగారుపడుతోంది... వళ్ళంత చెమట పట్టి, బాగా నీరసం వచ్చేసింది... సన్నగా నొప్పులు కూడా ప్రారంభం అయితే డాక్టర్‌ని తీసుకుని వచ్చాడు ఆదిత్య...

వెంటనే నర్సింగ్ హోమ్‌లో చేర్పించాలని చెప్పింది డాక్టరు సుష్మని పరీక్ష చేశాక.

"ఎందుకో అప్‌సెట్ అయ్యింది. ఏమైనా గొడవ పడ్డాడు? మెంటల్‌గా వర్రీ అవుతోంది... అందుకే డెలివరీ తొందరగా రావచ్చు. బాగా వీక్‌గా ఉంది... బ్లడ్ కూడా రెడీ చేసి ఉంచుకోవాలి... ఉదయమే నర్సింగ్ హోమ్‌కి తీసుకురండి..." అంటూ వెళ్ళిపోయింది డాక్టర్.

"వద్దు... మీరు ఇక్కడే ఉండండి!... ప్లీజ్!... అన్నది సుష్మ ఎందుకో? అరగంటలో పరిస్థితి విషమించితే వెంటనే అంబులెన్స్‌కి ఫోన్ చేసి సుష్మని నర్సింగ్ హోమ్‌కి తీసుకెళ్ళారు. వెళ్ళిన పది నిముషాలకే సుష్మకి నొప్పి ఎక్కువయ్యాయి... బాధని తట్టుకోలేక కేకలు వేస్తోంటే ఆదిత్య మరింత కంగారుపడిపోయాడు... సుభద్రమ్మ అందరికీ ధైర్యం చెపుతోంది... సుష్మని ఊరడిస్తోంది... మరి కొద్ది నిముషాలలో లేబర్ రూమ్‌కి తీసుకెళ్ళారు... తీసుకెళ్ళిన పది నిముషాలకే సుష్మకి పురుడు వచ్చేసింది... పురుడు తేలిగ్గానే అయింది. కానీ సుష్మ మాత్రం నీరసం వల్ల స్పృహ కోల్పోయింది... పుట్టిన పిల్లవాడు మరింత బలహీనంగా ఉన్నాడు... చలనం లేదు! ఏడుపు లేదు!! డాక్టర్ కంగారుపడిపోయి కాళ్ళు పట్టుకుని పైకెత్తి, క్రిందికి చూసేసరికి "కీచు" గా ఏడుపు వినిపించింది.

సుభద్రమ్మ హనుమాన్ చాలీసా పారాయణ చేస్తోంది... ఆదిత్య లోపల సుష్మకి ఎలా ఉందోనని కంగారు పడుతూ అటు ఇటూ తిరుగుతూ ఉన్నాడు... నర్సు వచ్చి - "మగపిల్లాడని" చెప్పి లోపలికి వెళ్ళిపోయింది.

సుభద్రమ్మకి మనమడు పుట్టాడన్న సంతోషం నిలవనీయలేదు. రెండు చేతులెత్తి భగవంతుడికి నమస్కరిస్తూ కృతజ్ఞతలు చెప్పుకుంది... గబగబా లోపలికి వెళ్ళింది. ఆదిత్య కూడా తల్లి వెనకాలే వెళ్ళాడు... సుష్మ గురించి ఆలోచిస్తున్నాడు ఆదిత్య... బాగా అలసిపోయింది!... కళ్ళు మూసుకుని నిద్రావస్థలో ఉంది - "డాక్టర్-" అన్నాడు కంగారుగా...

"ఇంజెక్షన్స్ మత్తు వలన అలా ఉంది... పది నిముషాల్లో తేరుకుంటుంది. ముందు "బేబీ" ని చూడండి అంటూ వెళ్ళిపోయిందామె...

స్పృహ తప్పిన సుష్మ పక్కనే పొత్తిళ్ళలో వెచ్చగా పడుకుని ఇంకా కళ్ళు తెరవని ... నల్లగా, కురచగా... అర చెయ్యిలో ఇమిడే ఆకారంలో ఉన్న ఆ పసి గుడ్డుని చూసి "కెవ్వు" మన్నాడు ఆదిత్య!

సుభద్రమ్మ స్థాణువే అయ్యింది!!